సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 26 । ఆగస్టు । 2024



డ్రోన్ వ్యవ'సాయం'

వ్యవసాయంలో కూలీల కొరతను డ్రోన్లతో అధిగమిస్తున్నారు. ఆరు నిమిషాల్లో ఎకరా పొలంలో పిచికారీ పూర్తి చేస్తున్నారు.

8లో



తెగుళ్లకు చెక్

వరిలో కలుపు నివారణతో ఆశించిన దిగుబడి. సకాలంలో కలుపు తీయడం వల్ల తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

8లో



ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

భీమవరంలో మూడు రోజులుగా జరుగుతున్న స్టేట్ సబ్ జూనియర్ అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి.

8లో

న్యూస్‌రీల్

ప్రిన్సిపాల్ శాంతికి జాతీయ పురస్కారం



పిట్టా శాంతికి అవార్డు అందిస్తున్న దృశ్యం

నరసాపురం : స్థానిక వైఎన్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ పిట్టా శాంతి సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్-2024కి సంబంధించి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆదివారం గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు నజీర్ మహ్మద్, గల్లా మాధవి తదితరులు పాల్గొన్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఏటా ప్రతిభావంతులైన అధ్యాపకులకు జాతీయస్థాయి పురస్కారాలు అందిస్తోంది.

ఎర్రకాలువకు వరద



మాధవరం కాజ్‌వే వద్ద వరద నీరు

తాడేపల్లిగూడెం రూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కొండ వాగులు, డ్రెయిన్లు పొంగి ఆ నీరంతా ఎర్రకాలువలోకి చేరుతోంది. దీంతో ఆదివారం తాడేపల్లిగూడెం మండలం మాధవరం-కంసాలిపాలెం కాజ్‌వే వద్ద తాత్కాలిక వారధిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. ఇప్పుడిప్పుడే ఎర్రకాలువ పరీవాహక రైతులు ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మరోసారి వరద ఆందోళన కలిగిస్తోంది.

ఆస్పత్రి కొత్త భవనం త్వరలో ప్రారంభం



రోగులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కోసం నిర్మించిన నూతన భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆదివారం ఆయన సందర్శించారు. ఆస్పత్రి తీరు ప్రమాదకరంగా ఉందని, త్వరలో నూతన భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. అనంతరం గత జగన్ ప్రభుత్వంలో రూ.16.40 కోట్లతో 150 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టగా సుమారు 95 శాతం పనులు పూర్తిచేసుకున్న ఈ నూతన భవనాన్ని మంత్రి నిమ్మల పరిశీలించారు. ముందుగా స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన సీపీఎం నేత వలవల శ్రీరామమూర్తి సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. రైతు ఉద్యమ నేతగా ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమని చెప్పారు.

రేపు చిన్న తిరుపతిలో కృష్ణాష్టమి వేడుకలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో ఈనెల 27న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. వేడుకల సందర్భంగా ఆ రోజు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే క్షేత్రంలో 28న సాయంత్రం ఉట్ల పండుగను, శ్రీవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు.

నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): స్త్రీనిధి రుణాల చెల్లింపులకు నగదు రహిత లావాదేవీలను పెంపొందించే దిశగా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో స్త్రీనిధి రుణాల రికవరీ నిమిత్తం 60 పేటీఎం మెషీన్లను సీసీలకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల మంజూరు లక్ష్యంగా రూ.120 కోట్లు కాగా ఇప్పటివరకు 6,249 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.50 కోట్లు అందించామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ రుణాలు దోహదపడతాయన్నారు. స్త్రీనిధి రుణాల రికవరీ 99 శాతం నమోదు కావడం విశేషమన్నారు. జాప్యం లేకుండా నగదురహిత లావాదేవీలు జరిపించేందుకు పేటీఎం మెషీన్లు అందించామన్నారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, నెట్ బ్యాంకింగ్ జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, స్త్రీనిధి బ్యాంక్ మేనేజర్ పి.శ్రీరామ్ పాల్గొన్నారు.



మహిళల భద్రతపై దృష్టి సారించాలి



ఒక్క ఆస్పత్రులు అనే కాదు మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారికి కనీస సౌకర్యాలు, భద్రత కల్పించాలి. తూర్పుతాళ్లు పీహెచ్‌సీలో నైట్ వాచ్‌మెన్ లేరు. సుమారు ఆరేళ్ల క్రితం ఇక్కడి పోస్టు ఖాళీ అయ్యింది. నరసాపురం ఏరియా ఆస్పత్రిలో కూడా వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది **భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.**

– మన్నె నాగమణి, హెల్త్ ఎడ్యుకేటర్, తూర్పుతాళ్లు పీహెచ్‌సీ

పునరావృతం కాకుండా చూడాలి



కోల్‌కతా ఘటన తలుచుకుంటే మానవ సమాజంలోనేనా మనం బతుకుతున్నది అనిపిస్తోంది. ప్రజలకు సేవ చేయాలనే మహోన్నత ఆశయంతో వేలాది మంది యువతులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయడం ద్వారా **వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి.**

– జి.దుర్గారాణి, ఫార్మసిస్ట్, ఎల్బీచర్ల పీహెచ్‌సీ

వినాయక విగ్రహాల కళకళ

ప్రతిమావంతులు

- చవితి వేడుకలకు ముస్తాబు
- జిల్లాలో జోరుగా తయారీ
- ఏటా 14 వేల మండపాల ఏర్పాటు
- విగ్రహాల విక్రయాలపై రూ.10 కోట్ల వ్యాపారం





అత్తిలిలో గణనాథుని విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు



సాక్షి, భీమవరం/అత్తిలి: వినాయకచవితి నవరాత్రులకు బొజ్జ గణపయ్యలు ముస్తాబవుతున్నారు. మూషిక వాహనం, గరుడ, అశ్వ, మయూర, గోవు తదితర వాహనాలపై కొలువుదీరి పూజలందుకునేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో గణపతి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. మూడు అడుగుల నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు.

జిల్లాలో ఘనంగా..

వచ్చేనెల 7వ తేదీన గణపతి నవరాత్రులు మొదలుకానున్నాయి. జిల్లాలో భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డు, మెంటేవారితోట, నాచువారి సెంటర్, నరసాపురంలోని స్టీమర్ రోడ్డు, పంజా సెంటర్, పాలకొల్లు బ్రాడీపేట, జెట్టి ట్యాంక్, రెల్లిపేట, తణుకు మండలం వేల్పూరు, ఆకివీడులోని సంతపేట, మాదివాడ, శాంతి నగర్, తాడేపల్లిగూడెంలోని బ్రహ్మానందరెడ్డి మార్కెట్, ట్యాక్సీ స్టాండ్, గణేష్ నగర్, పెనుగొండ వేండ్ర వారి వీధి, కంభాల వారి వీధి, జవ్వాది వారి వీధి తదితర ప్రాంతాల్లో నవరాత్రులు ఘనంగా చేస్తారు.

300కు పైగా రాజస్తాన్ కుటుంబాలు

వైట్‌సెమ్ మిశ్రమం, కొబ్బరిపీచు, అద్దకపు రంగులతో అందమైన రూపాల్లో వినాయక విగ్రహాల తయారీలో రాజస్తాన్ కళాకారులు నైపుణ్యం చూపుతున్నారు. రాజస్తాన్‌కు చెందిన 300 పైగా కుటుంబాలు ఇదే వృత్తిగా జిల్లాలో జీవనం సాగిస్తున్నారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, అత్తిలి, కవిటం తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన శిబిరాలు ఏర్పాటుచేసుకుని ఇంటిల్లపాదీ బొమ్మలు చేస్తున్నారు. విగ్రహం పరిమాణం బట్టి మూడు నుంచి వారం రోజుల సమయంలో పూర్తిచేస్తారు. రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకు ధరల్లో విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. విగ్రహాల తయారీలో పర్యావరణానికి హాని కలగని విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు కళాకారులు చెబుతున్నారు. సహజమైన అద్దకపు రంగులు వినియోగించడంతో కాలుష్యం ఉండదంటున్నారు.

భారీగా అమ్మకాలు

జిల్లాలో సుమారు 14 వేల వరకు చవితి మండపాలు ఏర్పాటు చేస్తారని అంచనా. ఉత్సవ కమిటీలు ఎక్కువగా ఐదు నుంచి పది అడుగుల విగ్రహాలకు ప్రాధాన్యమిస్తాయి. ఇతర జిల్లాలకు చెందిన ఉత్సవ కమిటీలు కూడా ఇక్కడి నుంచి విగ్రహాలను తీసుకువెళుతుంటారు. జిల్లాలో ఏటా బొమ్మల తయారీ ద్వారా రూ.10 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా. ముడి సరుకుల ధరలు పెరగడంతో తమకు మిగిలేది అంతంతమాత్రమేనని కళాకారులు అంటున్నారు. అమ్మకాలు సరిగా లేకపోతే నష్టాలు తప్పవని చెబుతున్నారు.

బొమ్మల తయారీనే వృత్తి



బొమ్మల తయారీనే మా వృత్తి. మా కుటుంబం రాజస్తాన్ నుంచి వలస వచ్చి 12 ఏళ్లు కావస్తోంది. అత్తిలిలోని పిప్పర రోడ్డులో స్థలం లీజుకు తీసుకుని ఏడాది పొడవునా బొమ్మలు చేస్తాం. ఈ ఏడాది బొమ్మల తయారీ దాదాపు పూర్తి కావచ్చింది. ఇటీవల స్థానికంగానూ బొమ్మల తయారీ మొదలవ్వడంతో అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

– ధనరాజ్, రాజస్తాన్ కళాకారుడు, అత్తిలి

సాధికారతకు 'లఖ్‌పతి దీదీ' రుణాలు

కలెక్టర్ నాగరాణి



భీమవరం కలెక్టరేట్‌లో మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్) : స్వయం సహాయక సంఘాల మహిళలు లఖ్‌పతి దీదీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం ప్రధాని మోదీ చేపట్టిన లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 736 స్వయం సహాయక సంఘాల సభ్యులైన లఖ్‌పతి దీదీలకు రూ.90.51 కోట్ల రుణాలను అందిస్తున్నామన్నారు. జిల్లాకు 3,517 లఖ్‌పతి దీదీల లక్ష్యంగా నిర్దేశించారన్నారు. వంద రోజుల ప్రణాళికలో లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకోవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం కలెక్టర్ మహిళా సంఘాలకు రుణాల చెక్కును అందించారు. డీఆర్వో జె.ఉదయ భాస్కర్ రావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, డీఆర్‌డీఏ సిబ్బంది కుసుమకుమారి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీనివాస ప్రసాద్, డీఆర్‌డీఏ సిబ్బంది, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అమృత్‌ం.. ఆలస్యం

పనులపై అలసత్వం

- అమృత్ 2.0లో ఏడాది క్రితమే నిధులు
- జిల్లాలో ఐదు పట్టణాలకు రూ.278 కోట్లు
- డీపీఆర్‌ల తయారీపై నిర్లక్ష్యం
- ముందుకు కదలని పథకం
- మరో ఏడాది మాత్రమే సమయం
- తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువు

భీమవరం (ప్రకాశం చౌక్) : జిల్లాకు మంజూరైన అమృత్ 2.0 పనులపై నీలినీడలు అలముకున్నాయి. పట్టణాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థలను మరింత మెరుగుపరిచేందుకు అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) 2.0 పథకంలో గతేడాది జూలైలో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూ.278.51 కోట్లు మంజూరు చేసింది. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు, ఆకివీడు పట్టణాలకు నిధులు కేటాయించింది. పనులు చేపట్టాలని అప్పటి కలెక్టర్‌కు కేంద్రం అనుమతులిచ్చింది. అయితే పథకం అమలులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఆయా పట్టణాల్లోని మున్సిపల్ అధికారులు అసలు ఈ పథకాన్నే పట్టించుకోవడం లేదు. ప్రజారోగ్య శాఖ అధికారులకు సహకరించడం లేదు.

డీపీఆర్‌ల తయారీలో అలసత్వం

అమృత్ 2.0లో నిధులు మంజూరు చేసి వెంటనే ఆయా పట్టణాల్లో చేపట్టాల్సిన పనులపై అప్పటి కలెక్టర్ ప్రశాంతి డీపీఆర్‌లు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇది జరిగి ఏడాది పూర్తయినా ఇప్పటికీ ఒక్క డీపీఆర్ కూడా సిద్ధం కాలేదు. డీపీఆర్‌ల తయారీలో అధికారులు నిండా అలసత్వం వహిస్తున్నారు. 2025-26 వరకు ఈ పథకానికి సమయం ఉంది. భారీగా నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు డీపీఆర్‌ల తయారీకి ఏడాది అయినా సరిపోలేదంటే అధికారులు అమృత్ 2.0పై ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని కలెక్టర్లు

అమృత్ 2.0లో నిధులు మంజూరైన తర్వాత ప్రాజెక్టు పనులపై చర్యలు తీసుకునేలోపు కలెక్టర్ ప్రశాంతి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ పథకాన్ని పట్టించుకోలేదు. ప్రస్తుతం ఉన్న కలెక్టర్ నాగరాణి కూడా అమృత్ 2.0 పనులను పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకూ అధికారులతో కనీసం సమీక్షించలేదు. దీంతో పథకం పనులు అటకెక్కాయి. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా జిల్లా అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



భీమవరం పట్టణ వ్యూ

డీపీఆర్‌లు తయారవుతున్నాయి

అమృత్ 2.0 కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు పట్టణాలకు కేటాయించిన పనులకు సంబంధించి డీపీఆర్‌లు తయారవుతున్నాయి. వేగంగా డీపీఆర్‌లు పూర్తిచేసి టెండర్ల ప్రక్రియకు చర్యలు తీసుకుంటాం.

–ఆర్.విజయ్, పబ్లిక్ హెల్త్ డీఈ

అమృత్ 2.0లో చేపట్టాల్సిన పనులు

- జిల్లాలోని ఐదు పట్టణాలను ఈ పథకంలో ఎంపిక చేశారు.
- తాగునీరు, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం.
- కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, పైప్‌లైన్ల విస్తరణ, మురుగు నీటిని శుద్ధి చేసి రీసైకిల్ చేయడం (ఎస్టీపీల నిర్మాణం), నీటి సంరక్షణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి, వాటర్ ట్యాంకుల నిర్మాణం, హౌసింగ్ కాలనీల్లో ఎస్టీపీల నిర్మాణం తదితర పనులు.
- మూడు ఎస్టీపీలు (సీవేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు) ప్రతిపాదించారు. భీమవరం హౌసింగ్ కాలనీల్లో రూ.28.58 కోట్లతో రెండు ప్లాంట్లు, తాడేపల్లిగూడెంలో రూ.100.20 కోట్లతో ఒక ప్లాంట్ నిర్మాణం.

పట్టణాల వారీగా..

పట్టణం	పనులు	నిధులు
భీమవరం	ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిలు, 24 గంటల తాగునీరు సరఫరా పనులు, ఎస్టీపీ ప్లాంట్లు	రూ.75.87 కోట్లు
తాడేపల్లిగూడెం	నీటి సరఫరా అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు, హౌసింగ్ కాలనీలో ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణం	రూ.141.49 కోట్లు
నరసాపురం	నీటి సరఫరా అభివృద్ధి	రూ. 21 కోట్లు
ఆకివీడు	నీటి సరఫరా అభివృద్ధి, ఇతర పనులు	రూ. 31.79 కోట్లు
తణుకు	నీటి సరఫరా అభివృద్ధి	రూ. 8.36 కోట్లు

జ్వరం కమ్మేసి.. కను'పాప'ను చిదిమేసి..

దుంపగడపలో టెన్త్ విద్యార్థిని మృతి



దుర్గాలహరి (ఫైల్)

ఆకివీడు : జ్వరంతో చికిత్స పొందుతూ పదో తరగతి విద్యార్థిని మృతిచెందిన ఘటన ఆకివీడులో చోటుచేసుకుంది. ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమార్తెను కోల్పోయామని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని దుంపగడపకు చెందిన నిడమోలు నాగేంద్ర కుమార్తె దుర్గాలహరి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. నాగేంద్ర కుమారుడు సాయి మణికంఠ కూడా అదే పాఠశాలలో చదువుతున్నాడు. లహరి, మణికంఠ జ్వరం బారిన పడ్డారు. ఆకివీడు సీహెచ్‌సీలో వైద్యం పొందుతుండగా లహరికి శనివారం రాత్రి జ్వరం మరింత తీవ్రమై వాంతులు, వీరేచనాలు కావడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. బాలికను ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు తల్లి నాగలక్ష్మి వాపోయారు. బాలికకు చేసిన ఇంజెక్షన్ వికటించడంతోనే మృతి చెందినట్టు ఆరోపిస్తున్నారు. దీనిపై సీహెచ్‌సీ డాక్టర్ భవానీని వివరణ కోరగా శనివారం ఉదయం సూపరింటెండెంట్ వైద్యం మొదలుపెట్టారని, సాయంత్రం తాను పరీక్షించానన్నారు. బాలిక అల్పాహారం తిన్న తర్వాత వాంతులు, వీరేచనాలతో నీరసపడిందని, తాను ఎలాంటి హైడోస్ ఇంజక్షన్ చేయలేదన్నారు. బాలిక నోటి నుంచి నురగ రావడం, బీపీ తగ్గడంతో ఏలూరు రిఫర్ చేశామన్నారు. ఊపిరందకపోవడం వల్లే బాలిక చనిపోయినట్టు డాక్టర్ భవానీ చెప్పారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం

దుంపగడప గ్రామంలో విషజ్వరాలు ఉధృతంగా ఉన్నా వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదని, అలాగే గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరం వస్తే మాత్ర ఇచ్చి వెళ్లిపోతున్నారని, ఆరోగ్య పరీక్షలు చేయడం లేదని అంటున్నారు. గ్రామంలో పలువురు జ్వరాలు, ఒళ్లునొప్పులు, కాళ్లు, చేతులు, మొహం ఉబ్బరం, మచ్చలతో ఇబ్బంది పడుతున్నారని, జిల్లా వైద్యాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

అభాగ్యులకు ఆసరా

సాక్షి స్పందన



చికిత్స పొందుతున్న వృద్ధులు

పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లులో ఇద్దరు వృద్ధుల దీనావస్థపై 'ఆదుకునే నాథులేరి' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. గుర్తుతెలియని వ్యక్తులు రెండు వేర్వేరు ప్రాంతాల్లో నాలుగు రోజులుగా పడి ఉన్న సంఘటనలను ప్రస్తావించగా.. వీరిద్దరినీ మున్సిపల్ కమిషనర్ చొరవతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి కోసం ఎవరూ రాలేదని ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. అభాగ్యులను ఆదుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి క్రీడా సంబరాలు

భీమవరం: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం పేరిట క్రీడా సంబరాలను నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎస్‌డీఓ ఎం.రాజేష్ తెలిపారు. భీమవరం డీఎన్నార్ కళాశాల, ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్‌లో సంబరాలు నిర్వహిస్తామన్నారు. 26న విద్యాసంస్థల్లో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న క్రీడా పోటీలు, 28న పిల్లల క్రీడా పోటీలు, 29న 3కే ర్యాలీ, క్రీడాకారులకు సన్మానం, 30, 31 తేదీల్లో సామాజిక మాధ్యమాల ద్వారా క్రీడా ఐక్యత, సృజనాత్మక, క్రీడా చిత్రాలు, లఘు చిత్రాలు వ్యాసరచన, చిత్రకళల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


వగ్గి జ్యోతి(ఫైల్)

తణుకు: తణుకు పట్టణానికి చెందిన వివాహిత అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మాజేటి వారి వీధిలో ఉంటున్న వగ్గి జ్యోతి అలియాస్ హిమబిందు భర్త మణికంఠతో మనస్పర్థల కారణంగా ఈనెల 20న సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రాంతాలతోపాటు బంధువుల ఇళ్లలో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జ్యోతి ఆచూకీ తెలిసిన వారు పట్టణ సీఐ 94407 96640, పట్టణ ఎస్సై 91549 65934 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై శ్రీనివాస్ కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


ఎస్. దావీదు (ఫైల్)

కాళ్ల: భీమవరం వెళ్లిన భర్త తిరిగి రాలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం మేకలదిబ్బ గ్రామానికి చెందిన ఎస్.దావీదు శనివారం భీమవరం వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఆదివారం కూడా తిరిగి రాలేదు. దీంతో భార్య మరియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు 94407 96649 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

రైలునుంచి పడి వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వే స్టేషన్ పరిధి పెద్దఅవుటపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వించ్‌పేట, రామ్‌గోపాల్ సత్రం వీధి ప్రాంతానికి చెందిన ఈబుది నాగరాజు (48) అంధుడు కావటంతో రైలులో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. విజయవాడలో అద్దె ఇంటిలో ఉంటూ రోజూ రత్నాచల్, సింహాద్రి, జన్మభూమి, కాకినాడ తిరుపతి రైళ్లలో భిక్షాటన చేసేవాడు. ఆదివారం ఉదయం తన తోటి వ్యక్తి బొమ్మిని గుర్రప్పతో కలిసి విజయవాడలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. జనరల్ బోగీలో భిక్షాటన చేస్తూ ఉండగా పెద్ద అవుటపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ పీ.సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాలువలో మునిగి వ్యక్తి మృతి

ఉండి: ఉండి మండలం పాందువ్వ గ్రామ శివారు ఖండ్రికకు చెందిన పసుపులేటి ప్రభాకరరావు(40) పంట కాలువలో మునిగి మృతిచెందాడు. మతిస్థిమితం లేకపోవడంతో ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతని భార్య సీతామహాలక్ష్మి 18వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయం 8 గంటలకు ఖండ్రికకు సమీపంలోని పంట కాలువలో అతను శవమై తేలడంతో గుర్తించిన బంధువులు భార్యకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.



ప్రత్యేక చట్టం తీసుకురావాలి



వైద్య, ఆరోగ్య సిబ్బంది భద్రత కోసం అవసరమైన మార్గదర్శకాలు రూపొందించి ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలు అందించే వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పట్ల దాడులు, వేధింపులు దారుణం. ఇలాంటి అమానవీయ సంఘటనలపై చర్యలు తీసుకునేలా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. దాడులు, అత్యాచారాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించి శిక్షలు పడేలా చట్టాలు ఉండాలి.

–సయ్యద్ జబ్రుల్లా, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. బోధనాసుపత్రులు, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తోన్న మహిళా వైద్యులకు భద్రత కల్పిస్తూ ప్రత్యేక చట్టం తేవాలి. వైద్యులకు భద్రత లేకుంటే స్వేచ్ఛగా రోగులకు సేవలు అందించలేని పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైద్యులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వైద్య రంగంపై ప్రజల్లోనూ సానుకూల భావన రావాలి.

–డాక్టర్ స్టీవెన్‌సన్ బొందాడ, వైద్యుడు

డ్రోన్ వ్యవసాయం

- కేవలం 6 నిమిషాల్లో ఎకరం పొలంలో పిచికారీ
- జిల్లాలో 21 మందికి ఉచిత డ్రోన్ పైలెట్ శిక్షణ

కైకలూరు: వ్యవసాయమంటే ఎంతో శ్రమ అవసరం. కూలీల కొరత ఎక్కువగా ఉన్న ఇలాంటి తరుణంలో సాగులో డ్రోన్లు రైతన్నలకు సాయం చేస్తున్నాయి. కేవలం పురుగు మందులు పిచికారీ చేయడమే కాకుండా.. విత్తనాలు, ఎరువులు చల్లడం.. పంటలో చీడపీడలు, తెగుళ్లను, గుర్తించేలా ఫొటోలు తీయడం వంటి ఎన్నో పనులు చేస్తున్నాయి. మందుల పిచికారీ కోసం గంటల తరబడి రైతులు పొల్లాల్లో అగచాట్లకు ఫుల్‌స్టాప్ పడుతోంది. కేవలం ఆరు నిమిషాల్లో ఎకరం పొలంలో పిచికారీ పూర్తిచేసే డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. స్ప్రేయర్‌తో పురుగు మందుల పిచికారీ వల్ల వివిధ దుష్పరిణామాలతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇలాంటి వాటితో డ్రోన్ పురుగుమందుల పిచికారీ చేస్తే చెక్ పెట్టవచ్చు.


ఏలూరు జిల్లా గంగునివానిగుంటలో డ్రోన్ వాడకంపై శిక్షణ


డ్రోన్ సాయంతో మందును పిచికారీ చేస్తున్న శిక్షకుడు

సబ్సిడీపై డ్రోన్ల అమ్మకం

డ్రోన్‌లో అధునాతన సెన్సార్లు, డిజిటల్ ఇమేజీల ద్వారా పొలం చిత్రాన్ని స్పష్టంగా చూడొచ్చు. వ్యవసాయ రంగానికి మైక్రో, నానో, స్మాల్, మీడియం, లార్జ్ డ్రోన్‌లు ఉపయోగపడుతున్నాయి. కిసాన్ డ్రోన్ 24.8 కేజీల బరువు ఉంటుంది. తాడేపల్లిగూడెంలోని గరుడ ఏరో స్పేస్, అద్విత ఆగ్రోస్ కంపెనీ డ్రోన్లు విక్రయిస్తోంది. డ్రోన్ల సాయంతో 11 లీటర్లు, 16 లీటర్ల వరకు మందును పంట అడుగు భాగం వరకు పిచికారీ చేయొచ్చు. మామూలు స్ప్రే వల్ల మందు వృథా అవుతోంది. డ్రోన్‌లో ఆ సమస్య లేదు. పెద్ద కమతాల్లో చీడపీడల గురించి తెలుసుకోవడానికి పెద్ద రైతులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలు డ్రోన్ల పై ఆధారపడుతున్నారు. వీటి ధర రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంది. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది. రైతులకు 40 శాతం, అగ్రికల్చర్ విద్య చదివినవారికి 50 శాతం సబ్సిడీ అందిస్తున్నారు.

యువ రైతులకు ప్రోత్సాహం

డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయం చేసే యువ రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గుంటూరు సమీపంలోని లాంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బ్యాచ్‌లుగా డ్రోన్ ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఏలూరు జిల్లా నుంచి ఇంతవరకు 21 మంది శిక్షణ పొందారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) జారీ చేసింది. డ్రోన్ పైలెట్లు, ఆపరేటర్లు ఏరియల్ క్రిమిసంహారక పిచికారీ ఆపరేషన్ సమయంలో అనుసరించాల్సిన సూచనలు, నిబంధనలు వివరిస్తారు. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత, 18 సంవత్సరాల వయస్సు దాటి ఉండాలి.

డ్రోన్లతో ఉపయోగాలివి..

ఎకరం పొలంలో మందు పిచికారీ చేసేందుకు రైతుకు 100 నిమిషాల సమయం పడుతుంది. డ్రోన్‌తో కేవలం 10 నిమిషాలు సరిపోతుంది. రైతు స్ప్రే చేస్తే ఇంధనం ఖర్చు అదనం. అదే డ్రోన్‌కు ఇంధనం లేకుండా బ్యాటరీ సాయంతో పనిచేస్తుంది. గంటలో 4 ఎకరాల్లో డ్రోన్‌తో పిచికారీ చేయొచ్చు. రోజుకు 16 ఎకరాలు పిచికారీ చేస్తే ఎకరానికి రూ.500 చెల్లించాలి. అలా రోజుకు డ్రోన్ యజమానికి రూ.8000 సంపాదన వస్తోంది. అన్ని ఖర్చులూ పోను నెలకు రూ.58,000 ఆదాయాన్ని డ్రోన్ యజమాని పొందవచ్చు. వ్యవసాయ శాఖ డ్రోన్ వినియోగంపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కలిగిస్తోంది.

డ్రోన్ల వినియోగంపై శిక్షణ



వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి. డ్రోన్లతో పిచికారీ వల్ల సమయం తగ్గుతుంది. మందు వృథా కాకుండా పైరు అడుగు వరకు చేరుతుంది. ఏలూరు జిల్లాలో డ్రోన్ల వినియోగంపై 21 మందికి ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో 12 రోజుల శిక్షణ అందించాం.

–షేక్ హబీబ్ బాషా, జిల్లా వ్యవసాయాధికారి, ఏలూరు

600 ఎకరాల్లో పిచికారీ చేశాం



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 12 రోజులు డ్రోన్ శిక్షణ పొందాను. సొంతంగా డ్రోన్ కొని కైకలూరు నియోజకవర్గంలో 600 ఎకరాల్లో డ్రోన్‌తో రసాయనాలు పిచికారీ చేశాను. డ్రోన్ తీసుకెళ్లేందుకు బైక్‌కి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నాను. రైతులకు డ్రోన్ ఉపయోగాన్ని వివరిస్తున్నాను. అవసరమైనవారు 8498942619 నెంబరులో సంప్రదించవచ్చు.

– మారుబోయిన సాయిరాం, సానారుద్రవరం, కలిదిండి మండలం

ఆరోగ్య సమస్యల నుంచి విముక్తి



పొలాల్లో పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సరైన రక్షణ లేకపోవడంతో రసాయనాలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీర్ఘకాలంలో రైతు ఆరోగ్యం పాడవుతోంది. డ్రోన్లతో పిచికారీ వల్ల సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయి. పూర్తి స్థాయిలో మొక్కకు మందు చేరుతోంది. డ్రోన్ సాంకేతికతను అందరూ అలవర్చుకోవాలి.

– ఆర్.గంగాధరరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు. కైకలూరు

1న క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: సెప్టెంబర్ 1న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14 బాలురు క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్య వర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ఆవరణలో నిర్వహించే ఈ పోటీలకు 01-09-2010 తర్వాత పుట్టిన వారే అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు అంతర జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గలవారు ఒరిజినల్ పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్లతో పాటు సొంత క్రికెట్ కిట్‌తో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 9491044848 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ద్వారకాతిరుమల: కొడుకును హత్య చేసేందుకు ప్రయత్నించిన తండ్రి, బంధువులను ఘటన జరిగిన 24 గంటల లోపే ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కోడిగూడెంకు చెందిన దౌలూరి కాంతయ్యకు కుమారుడు ధర్మారావు, కుమార్తెలు దాసరి శ్యామల, బంటుమిల్లి సుజాతలు సంతానం. కాంతయ్యకు ఉన్న 4 ఎకరాల భూమి విషయంలో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 24 ఉదయం 11.30 గంటల సమయంలో ధర్మారావుకు, అతని తండ్రి కాంతయ్యకు మధ్య గొడవ జరిగింది. దాంతో కొడుకుని చంపేయాలని నిర్ణయించుకున్న కాంతయ్య తన పెద్ద కుమార్తె, ఇద్దరు అల్లుళ్లు, ఇద్దరు మనుమళ్లను రప్పించి, కత్తులు, ఇనుప రాడ్లతో ధర్మారావుపై దాడి చేసి, హత్య చేసేందుకు ప్రయత్నించారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ధర్మారావు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన ఎస్సై సుధీర్ ధర్మారావుపై హత్యాయత్నం చేసిన కాంతయ్య, అతని పెద్ద కుమార్తె శ్యామల, ఆమె భర్త దాసరి గంగరాజు, వీరి ఇద్దరి కుమారులు దాసరి వంశీ, దాసరి సుందర్, కాంతయ్య చిన్న అల్లుడు బంటుమిల్లి డేవిడ్‌ను ఆదివారం అరెస్టు చేశారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించగా, పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

మీ ప్రాణాలకు మీదే పూచీ!


మీ జాగ్రత్త.. మీరే తీసుకోండి అంటూ ఫ్లెక్సీ


ప్రమాదకర పరిస్థితిలోనే చదువు

ఎంతో మంది విద్యార్థులు ఈ గ్రంథాలయంలో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారు. రోజూ వందల మంది తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ గ్రంథాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గడుపుతుంటారు. అయితే ఈ గ్రంథాలయానికి వెళ్తే మీ ప్రాణాలకు గ్యారంటీ లేదు. పైగా గ్రంథాలయంలో శిథిలావస్థలో ఉందని.. జాగ్రత్తగా ఉండాలని.. ఏమైనా జరిగితే తమకు సంబంధం లేదన్నట్లుగా ఇక్కడ ఒక ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారు. ఇది ఏలూరులోని జిల్లా గ్రంథాలయం దుస్థితి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు


పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తదితరులు

భీమవరం: భీమవరం అంగర విజయలక్ష్మి కన్నయ్య ఇండోర్ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీమెంటే సుబ్బారావు, నాగరత్నం మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్ అండర్ -17 బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. విజేతలకు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతా రామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు తదితరుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు.

విజేతలు వీరే

అండర్ -17 బాయ్స్ సింగిల్స్‌లో చరణ్ రామ్‌పై టి.లక్ష్మి స్వేతాన్ 21-15,19-21,21-6 స్కోరుతో విజయం సాధించారు. అండర్ -17 బాలికల సింగిల్స్‌లో రేణుశ్రీ శ్యామలరావుపై హాసనశ్రీ 19-21,13-21 స్కోరుతో విజయం సాధించారు. అండర్ -17 బాయ్స్ డబుల్స్‌లో కే మహేంద్ర/మహమ్మద్‌పై చరణ్ రామ్/ హరికృష్ణ 16-21,17-21 స్కోరుతో విజయం సాధించారు. అండర్ -17 బాలికల డబుల్స్‌లో రేణుశ్రీ/హిమబిందు శ్యామలరావుపై హాసనశ్రీ/చౌదరి 16-21, 21-15, 20-22 స్కోరుతో విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో అభిషేక్/హాసనశ్రీ పై సాయి సాహిల్/స్ఫూర్తి 10-21, 11-21 తో విజయం సాధించారు. గెలుపొందిన వారు సెప్టెంబర్‌లో హరియాణాలో జరిగే నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించారని అకాడమీ చీఫ్ కోచ్ అంగర వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ముసునూరు: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ అజయ్‌బాబు తెలిపారు. లోపూడిలోని తమ్మిలేరు ఇసుక ర్యాంపు నుంచి ఆదివారం సాయంత్రం అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేసి, తరలిస్తున్న లోపూడికి చెందిన పేరం వెంకటేశ్వరరావు, పోలుబోయిన దుర్గారావును చెక్కపల్లి సెంటర్‌లో ట్రాక్టర్లతో సహా అదుపులోకి తీసుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

కాపు కల్యాణ మండప ట్రస్టు చైర్మన్‌గా వాసుబాబు

వైస్ చైర్మన్‌గా జ్యోతి శ్రీనివాస్


పుప్పాల వాసుబాబు


పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని కాపు కల్యాణ మండప ట్రస్టు చైర్మన్‌గా ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక, ట్రస్టు బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా వాసుబాబు, వైస్ చైర్మన్‌గా కల్యాణ మండప స్థలదాత పెద్దిరెడ్డి వేణుగోపాల కృష్ణారావు కుమారుడు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ (ద్వారకాతిరుమల), కార్యదర్శిగా పల్నాటి శివరామ ప్రసాద్ (ఏలూరు), ట్రెజరర్‌గా మాకా శ్రీనివాసరావు(తాడేపల్లిగూడెం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా చినమిల్లి వెంకటరాయుడు (భీమవరం), నూకల బాలాజీ (ఏలూరు), పాశ్యం రామానుజం (ఎంఎం పురం), ముత్తంశెట్టి కృష్ణారావు (హైదరాబాద్), కరాటం రాంబాబు (బుట్టాయిగూడెం), నంద్యాల కృష్ణమూర్తి(తాడేపల్లిగూడెం), సుంకర సూర్యనారాయణ (భీమవరం), చుండూరు వెంకట్రావు (ఆకివీడు), బొడ్డు వెంకటేశ్వరరావు (చింతలపూడి), మధ్యాహ్నపు బలరాం (ఏలూరు), మైగాపుల మోహన్‌రావు (ద్వారకాతిరుమల), అందే మహేష్‌లు ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో రూ.కోటి వ్యయంతో ఆంజనేయ మండప అభివృద్ధికి ఆమోదం తెలిపారు. మండపాల ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటు, రూ.3 లక్షలతో వాటర్ ప్యూరిఫైర్ ఏర్పాటుకు ఆమోదించారు.

కలుపు నివారణతో తెగుళ్లకు చెక్

పాడి - పంట



ముసునూరు: వరిలో కలుపు నివారణతో ఆశించిన దిగుబడి పొందే అవకాశం ఉందని, పంటలో సకాలంలో కలుపు తీయడం వల్ల తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా పొలంలో కలుపును కూలీలతో తీయించేవారు. ప్రస్తుతం కూలీల కొరతతో పాటు, కూలీ రేట్లు విపరీతంగా పెరగడంతో రైతులు ఇతర పద్ధతులపై ఆధారపడుతున్నారు. కలుపును నివారించేందుకు అనేక రకాల హెర్బిసైడ్‌లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. అయితే రసాయనిక మందులను ఇష్టం వచ్చినట్లు వాడితే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. ఏ రకమైన కలుపు మొక్కలకు ఏ మందు ఎంత మోతాదులో వాడాలనే విషయమై రైతులు అవగాహన ఉండడం వల్ల కలుపు పూర్తిగా నివారించవచ్చని చెబుతున్నారు.

నాటు వేసిన వరిలో..

వరి నాటు వేసిన 3 నుంచి 5 రోజుల్లోపు ప్రెటిలాకోర్ ద్రావకం 500 మిల్లీలీటర్లు లేదా ఆక్సాడయార్జిల్ 50 గ్రాములు లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ నీటిలో కరిగే గుళికలు 120 గ్రాములు లేదా బెన్ సల్ఫ్యూరాన్, ప్రెటిలాక్లోర్ గుళికలు 4 కిలోలు లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ గుళికలు ఎకరానికి 20 కిలోలు ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

2 నుంచి 4 ఆకుల దశలో..

మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ లేదా క్లోరి మ్యూరాన్ ఈథైల్ 8 గ్రాములు పిచికారీ చేయడంతో వెడల్పాకు కలుపు, తుంగ అరికట్టవచ్చు. సహాలో ఫాప్ బ్యూటైల్ ద్రావకం 400 మి.లీ తీసుకుని 1.5 మి.లీ నీటికి కలిపి ఎకరాకు పిచికారీ చేయడం వల్ల ఊదగడ్డిని నివారించవచ్చు. ఫెనాక్సీ ప్రోప్ ఈథైల్ ద్రావకం 250 మి.లీ ఎకరాకు పిచికారీ చేయడం వల్ల ఊద, ఏక వార్షిక గడ్డి నివారించవచ్చు. పెనాక్సులం లేదా సైహలోపాస్ బ్యూటైల్ ద్రావకాన్ని 800 నుంచి 900 మి.లీ పిచికారీ చేస్తే వెడల్పాకు, తుంగ, ఏక వార్షిక గడ్డి జాతి కలుపు చనిపోతుంది.

కలుపు 4 ఆకుల దశలో..

కొన్ని రకాల గడ్డి, వెడల్పాకు, తుంగ కలుపు మొక్కలున్నపుడు బిస్పైరిబాక్ సోడియం ద్రావణాన్ని ఎకరానికి 80 నుంచి 100 మి.లీ.లు పిచికారీ చేయాలి. పెనాక్సులం ద్రావకం 400 మి.లీ.లు ఎకరానికి పిచికారీ చేయడం వల్ల వెడల్పాకు, తుంగను అరికట్టవచ్చు. ట్రయాఫామోన్, ఇథాక్సి సల్ఫ్యూరాన్‌ను 90 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

4. డ్రమ్ సీడర్, నేరుగా వెదజల్లే వరిలో..

పైరజోసల్ఫ్యూరాన్, ఈథైల్ 10 శాతం పొడి 80 గ్రాములు ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి, విత్తిన 3 నుంచి 5 రోజుల్లో చల్లుకోవాలి. ప్రెటిలాక్లోర్ 30 శాతం, పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 0.75 శాతం గుళికలు విత్తిన 3 నుంచి 5 రోజులకు ఎకరానికి 800 గ్రాములు చల్లుకోవాలి. వెడల్పాకు కలుపు, తుంగ, ఏక వార్షిక గడ్డిజాతి కలుపును అరికట్టవచ్చు.

జాగ్రత్తలు

కలుపు మందును సిఫార్సు చేసిన మోతాదులో అనువైన సమయానికి మాత్రమే పిచికారీ చేయాలి. మందు పిచికారీకి సరైన నాజిల్ వాడాలి.

కలుపు యాజమాన్యంతో అధిక దిగుబడులు



సమగ్ర యాజమాన్యం, కలుపు నివారణ జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చు. వ్యవసాయ శాఖ ద్వారా లభించే సలహాలు, సూచనలు పాటించి కలుపును సులువుగా నివారించవచ్చు.

–నందిపాము మధుమోహన్, మండల వ్యవసాయాధికారి, ముసునూరు

క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న వల్లీ సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రక్తదానం ప్రాణదానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని వల్లీ మోహన్ యువజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పటాన్‌వల్లి అన్నారు. సేవా సమితి వారిచే ఆదివారం స్థానిక నార్ని రత్నాలయం ఆసుపత్రిలో 10 మంది రక్త దానం చేశారు. వల్లి మాట్లాడుతూ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యదర్శి గొల్లేరు మోహన్, గౌరవాధ్యక్షులు అడపా తిలక్, కె.ప్రసాద్, కె.శివ, వై.మధు, పి.రంగారావు, డి.సతీష్, యూ.భాస్కర్‌రావు, దినేష్, భరత్, మోహన్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ స్కూల్స్, కళాశాలల్లోని పేద పేద విద్యార్థులకు గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సైకిళ్ల పంపిణీ చేశారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు, ఆర్గనైజేషన్ ట్రస్టీ చెన్నా జనార్ధనరావు పర్యవేక్షించారు. దాతలు గోపాల్ నాయుడు, రాధికలు సహకరించారు. కర్రి ప్రభాకర్ బాలాజీ మాట్లాడుతూ ఆర్గనైజేషన్ ఫౌండర్ త్రికళ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆనందరావు మాస్టారు, దుర్గా ప్రసాద్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డం మోషేకు సన్మానం



మారంపల్లి షారోన్ లూథరన్ చర్చి ఆవరణలో మోషేను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి లూథరన్ చర్చి ఆవరణలో ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ కొవ్వూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రెవరాండర్ గెడ్డం మోషేను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు తాతపూడి రాజు, గెడ్డం శ్రీను, గెడ్డం చినశ్రీను, దిద్దే ఆనందరావు, జి.దొరబాబు, జి.ప్రియాంక, అనెల్లి భార్గవి, చిడిపి దీవెనమ్మ, జి.లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాకారుల సంఘ సభ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 147వ నెలవారి సభ కార్యక్రమం డీఎస్ చెరువు సమీపంలో నిర్వహించారు. సభకు సూరంపూడి వెంకట రమణ అధ్యక్షత వహించారు. ఆదివారం రాత్రి జరిగిన సభ కార్యక్రమంలో వితరణ చేసిన శాశ్వత సభ్యులకు సత్కారాలు చేశారు. కుంచెనపల్లికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ప్రత్తిపాటి రాజుకు కళా పురస్కారం, ఉపాధ్యాయులు శీతాల సత్యనారాయణకు ఉత్తమ ఉద్యోగ సేవ పురస్కారం, నడింపల్లి సత్యవతికి ఆర్థిక సత్కారం అందజేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేశారు. బోడగిరి శ్రీనివాస్, బుల్లబ్బాయి, రాంబాబు, జోగినాయుడు, అన్నవరం, శ్రీను, సిరిమామిళ్ళ పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

15న చిన్నారులకు గుండె ఆపరేషన్లు

పెంటపాడు: సెప్టెంబర్ 15న ప్రత్తిపాడు త్రిపుల్ ఎఫ్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో 1 నుంచి 14 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు త్రిపుల్ ఎఫ్, స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధి ఓపీ గోయంకా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఆసుపత్రి చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుమన్ చిన్నారులకు ఆపరేషన్‌లు నిర్వహిస్తారన్నారు. వివరాలకు గోరంట్ల శ్రీనివాస రెడ్డి, 99496 49519, గణేష్ 63042 40277 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

కాళ్ల: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బొండాడపేట గ్రామ శివారు నేరేడుగరువులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,050 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలి



కలకత్తాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాలలో రెస్పిరేటరీ మెడిసిన్‌లో జూనియర్ వైద్యురాలిగా పని చేస్తున్న డాక్టర్‌పై జరిగిన హత్య చాలా ఘోరమైనది. ఇటువంటి సంఘటన ఎంతో బాధాకరమైనది. ఈ సంఘటనలో బాధ్యులైన వారందరినీ కఠినంగా శిక్షించాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలి.

– డాక్టర్ కొడమంచిలి ఆశాలత, అసిస్టెంట్ సివిల్ సర్జన్

తప్పు చేయాలంటే భయపడే శిక్షలుండాలి



మహిళా వైద్యులే కాకుండా మహిళలపై దాడి చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయని, అందువలన తప్పు చేయాలంటే శిక్షలు చూసి భయపడే విధంగా చట్టంలో కఠిన శిక్షలు ఉండాలి. మహిళలపై జరిగే అఘాయిత్యాలకు కఠిన శిక్షలు అమలు చేసేలా చట్టాలను తయారు చేయాలి. కలకత్తాలోని వైద్యురాలిపై జరిగిన దాడి దారుణం. దేశవ్యాప్తంగా ప్రజా స్పందనను చూసైనా ప్రభుత్వాలు మహిళల రక్షణకు కఠినమైన చట్టాలను రూపొందించాలి.

– సీహెచ్‌వీవీ సుబ్బలక్ష్మి, డ్వామా కార్యాలయ సూపరిండెంట్, తణుకు

తాగునీటి వృథా.. పట్టణవాసుల వ్యథ

- ఫైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు కలుషితం
- సమస్య పరిష్కరించాలని స్థానికుల వేడుకోలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ప్రధాన ఫైపులైన్‌కు లీకేజీ ఏర్పడడంతో గోనె సంచి కప్పిన దృశ్యం



పైప్‌లైన్ లీకేజ్ అవడంతో వృథాగా పోతున్న తాగునీరు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : ఒక పక్క తాగునీరు సరిపోక పట్టణవాసులు ఇబ్బందులు పడుతుంటే, మరో పక్క ఫైప్‌లైన్ లీకేజీలపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రధాన పైపులైన్‌కు పలు చోట్ల లీకేజీలు ఏర్పాడ్డాయి. తాగునీరు వృథా కావడమే కాక పైపులైన్‌లోకి మట్టి, బురద చేరుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. దీంతో పట్టణవాసులు దాహార్తితో విలవిలలాడుతున్నారు. వన్ టౌన్‌లో పురపాలక సంఘ ఓవర్ హెడ్ ట్యాంక్‌ల వద్ద నుంచి వార్ఫ్‌రోడ్డు సమీపంలోని బొవంతన మీదుగా తాగు నీరు భారీ పైపులైన్ టూ టౌన్‌కు వెళుతుంది. ఎన్నో ఏళ్లుగా ఈ పైపులైన్‌కు మధ్యలో జాయింట్‌ల వద్ద లీకేజీలు ఏర్పడుతున్నాయి. వాటిని సరి చేస్తున్నారు. పైపులైన్ సరిచేసే క్రమంలో తాగునీరు వదిలేటప్పుడు ఉదయం, సాయంత్రం ఎంతో నీరు వృథా అవుతుంది. ఈ క్రమంలోనే రెండు నెలలుగా పైపులైన్‌లో లీకేజీ ఏర్పడింది. నీరు వృథాగా పోతుంది. లీకేజీ కారణంగా భారీగా నీరు కారిపోవడంతో గుర్తించిన స్థానికులు లీకేజీ అవుతున్న పైపు లైన్‌పై గోనె సంచి ఉంచి, దానిపై బండరాయి పెట్టారు. తాగటానికి గుక్కెడు నీరు లేక ఎందరో అవస్థలు పడుతుంటే ఇలా తాగు నీటిని వృథా చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలాఉంటే వన్‌టౌన్‌లోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో మెట్లు ల్యాండింగ్ సమీపంలోని మటన్, కోళ్ల దుకాణాల సెంటర్ వద్ద, ట్రాక్టర్లు రిపేర్ చేసే ప్రాంతంలో పైపులైన్‌కు లీకేజీ కావడం, లీకేజీ గుండా మట్టి, బురద తాగు నీరులోకి చేరుతున్నాయి. మునిసిపల్ కార్యాలయం ఎదురుగా వంతెన కింద పైపులైన్‌కు మరో లేకేజీ ఏర్పడటంతో అక్కడ నీరు వృధాగా పోతుంది. అంతే కాకుండా నీటిలోకి వ్యర్థాలు చేరుతున్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి తాగు నీటిని వృథా చేయకుండా లీకేజీలను అరికట్టాలని, కలుషిత నీరు పైపులైన్‌లోకి చేరకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. వాటర్ వర్క్స్ డీఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా పైపులైన్‌లు లీకేజీలను గుర్తించి వాటిని అరికడతామని వివరించారు.

వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు

తణుకు టౌన్: సంచార వైద్యశాలలో వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో 8 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఎముకల వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్యలు సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, పైడిపర్రు పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి, సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు షేక్ మస్తాన్ ఆర్థిక సాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మోగుతున్న డేంజర్ బెల్స్

- భయపెడుతున్న డెంగీ
- అధికారికంగా ఇప్పటివరకు 3 కేసులు
- ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలల్లో ఖర్చు



తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఓపీ కోసం వేచి ఉన్న రోగులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డెంగీ పరీక్షలు నిర్వహించే పరికరాలు

తణుకు అర్బన్: విష జ్వరాలు, వైరల్ జ్వరాలతో అల్లాడుతున్న ప్రజానీకానికి తాజాగా డెంగీ కేసులు నమోదు అవుతుండడంతో జిల్లా వాసులు ఉలిక్కిపడ్డారు. ఇప్పటికే డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తూ ప్రాణాల మీదకు తీసుకొస్తున్న తీరుతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు వస్తున్న జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ఒళ్లు పులపరంగా ఉందంటే చాలు ప్రజానీకం హడలెత్తిపోతున్నారు. అంతే కాకుండా దోమ కుడితే చాలు అది డెంగీ దోమేమోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని తల్లడిల్లుతున్నారు అమాయక ప్రజానీకం. జిల్లాలో ప్రస్తుతం అధికశాతం వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ కేసులు నమోదవుతుండగా తాజాగా జిల్లాకు సంబంధించి తణుకులో 1, మొగల్తూరులో 2 డెంగీ కేసులు నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖతోపాటు ప్రజలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇప్పటి వరకు వైరల్ జ్వరాలే అనుకుని జాగ్రత్తలు చెబుతున్న వైద్య విభాగానికి డెంగీ కేసులు కంటి మీద కునుకు లేకుండా చేశాయి.

ప్రాణాంతకంగా మారిన వైనం

ఈ నెలలో తణుకులో ఒక యువతి, మొగల్తూరులో ఒక బాలుడు, మహిళకు జ్వరం వచ్చి డెంగీ లక్షణాలు కనిపించడంతో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన డెంగీ పరీక్షలో పాజిటివ్ వచ్చినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి, తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రుల్లో డెంగీ పరీక్షలు చేస్తుండగా జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆశ్రయించిన జ్వర పీడితుల్లో డెంగీ అనుమానితుల రక్త నమూనాలు తణుకు, తాడేపల్లిగూడెం ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. అయితే జిల్లాలోని వెయ్యికి పైగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గిన ప్రతీ ఒక్కరికి డెంగీగా నిర్ధారించి సంబంధిత వైద్యం అందిస్తున్నట్లుగా తెలుస్తోంది. జ్వరంతోపాటు విపరీతమైన నీరసం రావడం, రక్తపరీక్షల్లో ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గటంతో జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇప్పటికే గుట్టుచప్పుడు కాకుండా డెంగీకి ఖరీదైన వైద్యం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో నమోదైన 3 డెంగీ కేసులకు సంబంధించి బాధితులు ఆరోగ్యంగానే ఉన్నట్లుగా తెలుస్తోంది. 2022లో డెంగీ నిర్ధారణకు తణుకు, తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 గంటలు పని చేసే విధంగా ప్రత్యేక ల్యాబ్‌లను అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణ లోపమేనా?

పారిశుద్ధ్య నిర్వహణకు పెద్దగా ప్రాధాన్యమివ్వని పరిస్థితుల్లో అపరిశుభ్రమైన వాతావరణానికి తోడు దోమల సంఖ్య బాగా పెరిగిందని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. గతంలో ఏ రోజు చెత్త ఆ రోజే కంపోస్టుకు తరలించేవారని, డ్రైనేజీల్లో పూడికతీతతో పాటు నీటి ప్రవాహానికి అడ్డుపడ్డ చెత్తను రోజూ తొలగించేవారని, కానీ నేడు ఆ పరిస్థితులు లేవని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆఖరి మజిలీలో అనాథలకు అండగా

మానవత ఆధ్వర్యంలో అనాథ శవాలకు దహన సంస్కారాలు



దహన సంస్కారాలు చేస్తున్న మానవత జిల్లా నాయకులు మోహనరావు, తదితరులు

పెంటపాడు: అనాథలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని మానవత ఉమ్మడి జిల్లా మాజీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం పెంటపాడులో దిక్కులేని ఒక అనాథ సుజాత అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ఈ విషయం తెలుసుకున్న తాడేపల్లి మోహనరావు వెంటనే అక్కడకు చేరుకొని తన సొంత ఖర్చుతో మానవత హిందూ స్మశాన వాటికకు వాహనం ద్వారా తరలించి, దహన సంస్కారాల తంతును పురోహితుల ద్వారా పూర్తి చేయించి, బంధువులకు చేసినట్లుగా దహన సంస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మానవత సభ్యుడిని అయినందుకు గర్విస్తున్నానన్నారు. ఇప్పటికీ మూడు అనాథ శవాలకు దహన సంస్కారాలు చేశానన్నారు. ఈ పనిని తాను దైవకార్యంగా భావిస్తానని పేర్కొన్నారు. మండల మానవత సభ్యులు తారాడి పోల్, ఏలూరి వీరాస్వామి, మీసాల సత్యనారాయణ, విప్పర్తి వినాయకుడు, గ్రామ ప్రముఖులు కొవ్వూరి లక్ష్మణరెడ్డి, నక్కా సాంబశివ, చెరుకూరి బంగార్రాజు పాల్గొన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం



మార్కెట్‌లో రాజస్తాన్ కళాకారులు చేసిన కృష్ణుడి విగ్రహాలు

పెంటపాడు: ఈ నెల 26 నుంచి కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా మండలంలో ప్రసిద్ధి చెందిన కె.పెంటపాడు బైరాగి మఠంలోని గోపాలస్వామి ఆలయంలో మూడు రోజులు నిర్వహించే వేడుకలకు ఈవో రవి శంకర్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రాత:కాలంలో సుప్రభాత సేవ, అభిషేక దూప హారతి, సహస్రనామ పూజలు, రాత్రి 11 గంటలకు ఒరిస్సా సంప్రదాయంలో కృష్ణుడి జన్మాష్టమి వేడుకలు, పవళింపు సేవ, ఉయ్యాల సేవ, తదితర కార్యక్రమాలు ఆలయ అర్చకులు త్రిలోచనదాసు, పూర్ణచంద్రత్రిపాఠి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

మార్కెట్‌లో రంగురంగుల విగ్రహాలు

కాగా శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని పెంటపాడు, గూడెం, తదితర ప్రాంతాల్లో రంగురంగుల విగ్రహాలు లభ్యమవుతున్నాయి. కాగా వీటిని ఇప్పటికే భక్తులు కొనుగోలు చేశారు. రూ.100 నుంచి రూ.3 వేల వరకు సైజును బట్టి విగ్రహాలు అమ్ముతున్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టాలి

సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా



తణుకులో ధర్నాలో పాల్గొన్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

తణుకు: తరచూ ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలు యాజమాన్యాల నిర్లక్ష్య ఫలితమేనని, ఫ్యాక్టరీల్లో భద్రతాపరమైన లోపాలను అరికట్టి కార్మికుల ప్రాణాలు కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు వీరనారాయణ సెంటర్‌లో భగత్ సింగ్ విగ్రహం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఫార్మా కంపెనీల్లోని ప్రమాదాల్లో యాజమాన్యాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి భీమారావు మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది, పరవాడ ఫార్మాసిటీ కంపెనీలో ఒక కార్మికుడు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రమాదాలకు ప్రధాన కారణం కంపెనీల యాజమాన్యాలు భద్రతాపరమైన చర్యలు తీసుకోకపోవడమేనన్నారు. భద్రతాపరమైన చర్యలు పాటించని కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియో ప్రకటించిన ప్రభు త్వం తక్షణమే కార్మిక కుటుంబాలకు చెల్లించాలని కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళాసమాఖ్య జిల్లా ప్రధాన కార్యద ర్శి సికిలే పుష్పకుమారి, ఏఐటీయూసీ నాయకులు అనంత త్రివిక్రమరావు, దాకే మునలయ్య, గెడ్డం చంద్రశేఖరరావు, కరుటూరి ప్రసాద్, పాల్గొన్నారు.

30న సామూహిక వ్రతాలు



శ్రావణలక్ష్మిగా ప్రత్తిపాడు వై జంక్షన్ దుర్గమ్మ

పెంటపాడు: భక్తుల కోర్కెలు తీర్చే ప్రత్తిపాడు వై జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవార సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఈ నెల 30న ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో శ్రీదేవి, దేవాదాయశాఖ అధికారి మొగ్గళ్లపు పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొత్తలంక శివ సత్యనారాయణ బ్రహ్మత్వంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఉచిత సామూహిక శ్రావణ లక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గలవారు ముందుగా ఆలయం వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూజల్లో పాల్గొనే మహిళలకు ఆలయం ఆధ్వర్యంలో పూజా సామగ్రి ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరవుతారన్నారు. వివరాలకు దేవాలయ వేళల్లో సంప్రదించి, రసీదు పొందాలన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

ఏవో పార్థసారథి

పెంటపాడు: రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.పార్థసారథి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం పంటల నమోదు ప్రక్రియ తప్పనిసరి చేసిందన్నారు. ప్రతీ రైతూ వారి పంటకు రాయితీలు, ఇన్సూరెన్స్ పొందేందుకు వీలుగా ఈ క్రాఫ్ నమోదు ఖచ్చితంగా చేయించుకోవాలన్నారు. దీని వలన అధిక వర్షాలు వచ్చిన సందర్భంలో పంట పాడయితే ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు, పండిన పంటను అమ్ముకునేందుకు వీలుగా ఈ–క్రాఫ్ నమోదు ఎంతో అవసరమన్నారు. ఇంకా పలు ప్రయోజనాలు ఈ క్రాప్ వలన కలుగుతాయన్నారు. ఇప్పటికే 70 శాతం రైతులు పంట నమోదు చేయించుకున్నారన్నారు. వివరాలకు ఆయా వ్యవసాయ కేంద్రాల్లో వీఏఏలు, ఆర్బీకేలను సంప్రదించాలన్నారు.

‘ఉపాధ్యాయ’ ఓటర్ల నమోదు వేగిరపర్చాలి

భీమవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఓట్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని యూనియన్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ విద్యా రంగంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ఉద్యమ సంఘాల అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. 2018 నవంబర్ 1వ తేదీ నుంచి పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు హక్కుకు అర్హులన్నారు. పట్టణ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాయి వర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేవీ రామచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి పీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్లపైనే తిష్ట.. రాకపోకలు ఎట్లా?



గణేష్ చౌక్ వద్ద ప్రమాదకరంగా వెళుతున్న పశువులు



రాత్రి సమయంలో రాజీవ్‌చౌక్ సెంటర్‌లో కనిపించిన దృశ్యం

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

తణుకు: పట్టణంలో పశువుల సంచారం అధికమైంది. ఆవులు, గేదెలను యజమానులు ఇష్టానుసారంగా వదిలేస్తుండంతో రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ పడుకుంటున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. సరిగ్గా రోడ్డు మధ్యలో తిష్ట వేసి, వచ్చి పోయే వాహనాలకు స్పీడ్ బ్రేకర్లుగా తయారవుతున్నాయి. ఒక్కోసారి పశువులు గుంపులు గుంపులుగా వస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పశువులతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పశువులను రోడ్లపైకి వదిలే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డుపైకి ఆవులు, గేదెలను వదిలితే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసిన మున్సిపల్ అధికారులు వాటిని అమలు చేయడంలో మాత్రం విఫలమవుతున్నారు.